ప్రజాశక్తి
బుధవారం 12 ఏప్రిల్ 2023

జిసిసి స్థలాన్ని పరిశీలించిన పిఒ

ప్రజాశక్తి - కలెక్టరేట్

పార్వతీపురం పరిధిలో గల వెంకంపేట పంచాయతీ యర్రా కృష్ణమూర్తి నగర్‌లో గల జిసిసి స్థలం మంగళవారం ఐటిడిఎ పిఒ సి.విష్ణుచరణ్ పరిశీలించారు. 26 సెంట్లలో జిసిసి డివిజినల్ ఆఫీస్, బ్రాంచ్ ఆఫీస్, డీఆర్‌సి గోడౌన్ల నిమిత్తం ప్రతిపాదనలు ఇదివరకే జిసిసి మేనేజింగ్ డైరెక్టర్‌కు పంపామని జిసిసి డిఎం మహేంద్ర కుమార్ వివరించారు. జిల్లాలో గిరిజనులు సేకరించే అటవీ ఫల సంపదలకు వేల్యూ ఆడిషన్ కింద తయారీ చేసి ఆ ఉత్పత్తులను బయట మార్కెట్లో అమ్మకం ద్వారా గిరిజనులకు గిట్టుబాటు అవుతుందని తెలిపారు. అందుకు అవసరమైన కౌంటర్లు ఏర్పాటు చేస్తే గిరిజనులకు లాభకరంగా ఉంటుందని మహేంద్రకుమార్ పిఒకు వివరించారు. జిసిసి అభివృద్ధికి పిఒ, డిప్యూటీ సిఎం రాజన్నదొర సహాయ సహకారాలు కావాలన్నారు.

చర్చకురాని సమస్యలెన్నో..

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

జిల్లా పరిషత్ సమావేశం సాదాసీదాగా జరిగింది. చాలా వరకు ప్రజా సమస్యలు చర్చకు రాలేదు. వేసవి నేపథ్యంలో తాగునీటి సరఫరాపై మాత్రం చర్చ జరిగింది. ఫ్యామిలీ డాక్టర్ వైద్య సేవలపై ప్రజాప్రతినిధులంతా పోటా పోటీగా మాట్లాడారు. గృహ నిర్మాణం, బిల్లుల తదితరాలపై చర్చ నడిచింది. జిల్లా పరిషత్ ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అధ్యక్షతన మంగళవారం జరిగిన జిల్లా పరిషత్ సమావేశంలో డిప్యూటీ సిఎం, రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి పీడిక రాజన్నదొర, డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి పాల్గొన్నారు. ప్రజల సంక్షేమానికి పెద్దపీట వేస్తూ.. వైద్యారోగ్య రంగానికి ప్రాధాన్యత కల్పిస్తూ ప్రజలకు సత్వర సేవలందించాలని, వారిని అన్ని విధాలుగా సంరక్షించాలని జిల్లా పరిషత్ ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు పేర్కొన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి తొలి ప్రాధాన్యం ఇస్తూ వారికి అన్ని విధాలుగా అండగా నిలవాల్సిన ఆవశ్యకత ఉందని అన్నారు. సచివాలయాల సర్దుబాటు, విశాఖ - రాయ్‌పూర్ గ్రీన్ ఫీల్డ్ జాతీయ రహదారి పనులు జరిగే గ్రామాల్లో రోడ్ల మరమ్మతులు, ఫ్యామిలీ డాక్టర్ విధానంలో ప్రత్యేక సేవలు, సీజనల్ వ్యాధులు, మలేరియా వ్యాప్తి నివారణ, గృహ నిర్మాణాలు, రేషన్ పంపిణీ, అంగన్ వాడీ సేవలు తదితర అంశాలు చర్చకు వచ్చాయి.



సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ సిఎం రాజన్నదొర, వేదికపై డిప్యూటీ స్పీకర్, జెడ్‌పి ఛైర్మన్, కలెక్టర్లు

సాదాసీదాగా జెడ్‌పి సమావేశం
ఫ్యామిలీ డాక్టర్ వైద్యసేవలపై సుదీర్ఘ చర్చ

తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు

సమావేశంలో జెడ్‌పి ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు మాట్లాడుతూ వేసవి నేపథ్యంలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులను ఆదేశించారు. జలజీవన్ మిషన్ పథకంలో భాగంగా ఇంటింటికీ కుళాయిలు వేయించాలని, అవసరమైన చోట్ల విద్యుత్ మీటర్లు వేయించాలని చెప్పారు. ఫైలేరియాతో నడలేనివారిని వికలాంగులుగా గుర్తించి ఆర్థిక సాయం అందించాలని పార్వతీపురం ఎమ్మెల్యే అలజంగి జోగారావు కోరారు. గుమ్మడిగూడ పంచాయతీలో గృహ నిర్మాణ లబ్ధిదారుల వివరాలు ఆన్‌లైన్లో కనిపించలేదని సంబంధిత జడ్‌పిటిసి సభ్యురాలు సభ దృష్టికి తీసుకురాగా పరిశీలించి చర్యలు తీసుకోవాలని పార్వతీపురం కలెక్టర్‌ను కోరారు. సమావేశంలో విజయనగరం ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, పట్టభద్రుల ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవి రావు, నెల్లిమర్ల, బొబ్బిలి, పార్వతీపురం ఎమ్మెల్యేలు బడ్డుకొండ అప్పలనాయుడు, శంబంగి వెంకట చిన అప్పలనాయుడు, జిల్లా పరిషత్ సిఇఒ అశోక్ కుమార్, వివిధ విభాగాల జిల్లా స్థాయి అధికారులు, జెడ్‌పిటిసి సభ్యులు, ఎంపిపిలు పాల్గొన్నారు.

చర్చకురాని సాగునీటి పనులు

సాగునీటి ప్రాజెక్టులు, కాలువల నిర్మాణ పనులు పడకేశాయి. వేసవి ముగిసే లోపు ఈ పనులు చేపట్టకపోతే మరో ఏడాది పాటు ఒక్క అడుగు కూడా ముందుకు వేసే పరిస్థితి లేదు. ముఖ్యంగా తోటపల్లి కాలువల పనులు అసంపూర్తిగా ఉండడం వల్ల లక్ష్యానికి అనుగుణంగా నీరు అందించలేకపోతోంది. వీటిపై ప్రజాప్రతిథులు కనీసం ప్రస్తావించలేదు. మరోవైపు జిల్లాలో ఫెర్రో ఎల్లాయిస్ పరిశ్రమలను ఆదుకుని తమ జీవనోపాధి దెబ్బతినకుండా చర్యలు తీసుకోవాలంటూ కార్మికులు ఇటీవల ఎన్నోసార్లు విజ్ఞప్తులు చేశారు. పలు మార్లు నిరసన కార్యక్రమాలు కూడా చేపట్టారు. వీటిపై కనీసం చర్చించి తద్వారా ప్రభుత్వానికి కొన్ని సూచనలు, విజ్ఞప్తులు చేసేందుకు కూడా చొరవ తీసుకోలేదు. సోషల్ ఆడిట్‌లో భాగంగా ఉపాధి హామీలో అక్రమాలు జరిగినట్లు ఆరోపణలు ఉన్నాయి. వ్యవసాయ, ఉద్యాన పంటల్లో రైతులు అనేక అవస్థలు పడుతున్నారు. ఇవేవీ కనీసం చర్చించలేదు.

104, 108 వాహనాలకు ప్రత్యేక షెడ్లు

వివిధ మండలాలకు కేటాయించిన 104, 108 వాహనాలు నిలుపుదల చేసేందుకు ప్రత్యేక స్థలం లేకపోవటంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని, ఎండలో, వానలో బయటే ఉండటంతో రంగులు వెలిసిపోతున్నాయని జడ్‌పిటిసి సభ్యురాలు సభ దష్టికి తీసుకురాగా జడ్పీ ఛైర్మన్ సానుకూలంగా స్పందించారు. వాటి కోసం ప్రత్యేకంగా షెడ్లు నిర్మించాలని, దీనికి సంబంధించి అంచనాలను త్వరితగతిన తయారు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. పార్వతీపురంమన్యం జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ మాట్లాడుతూ రక్తహీనత నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని గుర్తు చేశారు. అంగన్ వాడీ కేంద్రాల ద్వారా పౌష్టికాహారం అందజేస్తున్నామని వివరించారు.

పూలేకు నివాళ్లు అర్పిస్తున్న సిపిఎం నాయకులు

అట్టడుగు వర్గాల ఆశాజ్యోతి పూలే

సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు

ంప్రజాశక్తి - కలెక్టరేట్

అట్టడుగు వర్గాలకు మార్గదర్శి, బడుగు బలహీన వర్గాలకు స్ఫూర్తిని అందించిన మహనీయులు, సత్యాగ్రహాన్ని ఆచరణలో పెట్టిన మొట్టమొదటి భారతీయుడు మహాత్మా జ్యోతీరావుపూలే అని సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు అన్నారు. పూలే జయంతి సందర్భంగా స్థానిక సుందరయ్య భవనంలో ఆయనకు నివాళ్లు అర్పించారు. ఈ సందర్భంగా రెడ్డి వేణు మాట్లాడుతూ పూలే గొప్ప సాంఘిక విప్లవకారుడని, హిందూ సమాజంలో శతాబ్దాలుగా నిస్సహాయుల ంగా పడి ఉన్నవారి కోసం జీవితమంతా శ్రమించిన త్యాగశీలి అని కొనియాడారు. అట్టడుగు వర్గాల ప్రజల కోసం, నిస్సహాయస్థితిలో ఉన్న స్త్రీల హక్కులకై పోరాడి వారికి స్వేచ్ఛా స్వాతంత్ర్యం కల్పించిన మహనీయుడు జ్యోతిబాపూలే అని కొనియాడారు. ఆయన పిల్లలకు పాఠాలు చెప్పే ఉపాధ్యాయుడే కాదని, సమాజానికే చదువు చెప్పిన మహానుభావుడని కొనియాడారు. సత్యాగ్రహ మార్గాన్ని ఆచరణలో పెట్టిన తొలి భారతీయుడని అన్నారు. ఇటువంటి సంఘ సంస్కరణ ఆశయాలను నేటి యువత ఆచరించడం అవసరమన్నారు. ఈరోజు కేంద్రం, రాష్ట్రంలో విచ్ఛన్నకర మత విధ్వంసం రెచ్చగొడుతూ ప్రజల మధ్య వైషమ్యాలను పెంచుతూ, ప్రజల ఆస్తులను కార్పొరేట్లకు ధార దత్తం చేస్తున్న ఈ పరిస్థితుల్లో జ్యోతిరావు పూలే మార్గంలో యువత, ప్రజానీకం నడవాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆయన అన్నారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి యమ్మ ల మన్మధరావు, కోశాధికారి జి.వెంకటరమణ, గిరిజన సంఘం నాయకులు కె.రామస్వామి, శ్రామిక మహిళ నాయకులు వి.ఇందిర, వి.చిన్నమనాయుడు తదితరులు పాల్గొన్నారు.

ప్రచారభేరి వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సిపిఎం, సిపిఐ నాయకులు

14 నుంచి వామపక్షాల ప్రచారభేరి

ప్రజాశక్తి - కలెక్టరేట్

బిజెపి మతోన్మాద, కార్పొరేట్ అనుకూల, నిరంకుశ ప్రజా వ్యతిరేక విధానాలపై ఈనెల 14 నుంచి 30 వరకు సిపిఎం, సిపిఐ ప్రచార భేరి అంబేద్కర్ విగ్రహం వద్ద ప్రారంభవుతుందని సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు అన్నారు. ప్రత్యేక హెూదా, రైల్వే జోన్ ఇవ్వకుండా విశాఖ స్టీల్ ప్లాంట్ అమ్మకానికి వ్యతిరేకంగా, రాష్ట్రానికి ద్రోహం చేసే బిజెపి విధానాలపై సిపిఎం, సిపిఐ రాజకీయ ప్రచారం చేస్తుందన్నారు. ఈ నేపథ్యంలో గ్రామ గ్రామాన సభలు, సమావేశాలు జరపాలన్నారు. ఈ మేరకు మంగళవారం స్థానిక సుందరయ్య భవనంలో ఏర్పాటుచేసిన పత్రిక విలేకరుల సమావేశంలో, పోస్టర్ విడుదల చేశారు. అనంతరం వేణు మాట్లాడుతూ మోడీ నిరంకుశ చర్యలను ఖండించాలని, ప్రచారభేరి యాత్రలో ప్రజలంతా పాల్గొనాలని పిలుపునిచ్చారు. సిపిఐ జిల్లా కార్యదర్శి కూరంగి మన్మధరావు, నాయకులు బొత్స మోహన్, కె.గోపినాయుడు మాట్లాడుతూ రాష్ట్రానికి నష్టం చేసే చర్యలకు వ్యతిరేకంగా పోరాడాలని పిలుపునిచ్చారు. ఈనెల 14న స్థానిక అంబేద్కర్ విగ్రహం వద్ద ప్రచారం ప్రారంభించి, 30 వరకు పాదయాత్రలో సభలు, సమావేశాలు జరుగుతాయని తెలిపారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వై.మన్మధరావు, వి.ఇందిరా, జిల్లా కమిటీ సభ్యులు జి.వెంకటరమణ, కె.రామస్వామి పాల్గొన్నారు.

హెల్త్ అలవెన్స్‌లు తక్షణమే చెల్లించాలి

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

మున్సిపల్ పారిశుధ్య కార్మికులకు ఒక నెల జీతం, రెండు నెలల హెల్త్ అలవెన్స్ ఇవ్వాలని మున్సిపల్ పారిశుధ్య కార్మికులు కమిషనర్ జె.రామ అప్పలనాయుడును కోరారు. మంగళవారం సిఐటియు జిల్లా కోశాధికారి గొర్లి వెంకటరమణతో కలిసి మున్సిపల్ కార్యాలయ ప్రాంగణంలో నిరసన తెలియజేస్తూ కమిషనర్‌కు వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా వారు కమిషనర్‌తో మాట్లాడుతూ ప్రతి నెలా ఒకటో తేదీన కచ్చితంగా జీతాలు చెల్లిస్తామని వైసిపి ప్రభుత్వం ఆప్కాస్ విధానాన్ని తీసుకువచ్చిందని, అయినప్పటికీ రాష్ట్రవ్యాప్తంగా ప్రతి నెలా జీతాలు చెల్లించే పరిస్థితిలో లేదని అన్నారు. రెండు నెలల నుంచి నాలుగు నెలల వరకు రాష్ట్ర మున్సిపల్ కార్పొరేషన్‌లో జీతాలు పెండింగ్లో ఉన్నాయని, కావున ఆప్కాస్ విధానం రద్దు చేయాలని, పెండింగ్‌లో ఉన్న జీతాలు చెల్లించాలని, యూనిఫాం, చెప్పులు, సబ్బులు, నూనెలు ఇవ్వాలని, ఆప్కాస్ విధానంలో 60ఏళ్ల దాటిన వారిని బలవంతంగా ఉద్యోగం నుంచి తొలగించారని, వారి రక్తసంబంధీకులకు వారసత్వంగా ఉద్యోగం ఇవ్వడం లేదని వెంటనే ఉద్యోగాలు వేయాలని కోరారు. కార్యక్రమంలో పలువురు మున్సిపల్ పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

పాలకొండ: మున్సిపల్ పారిశుధ్య కార్మికులకు రెండు నెలల వరకు పెండింగ్‌లో ఉన్న జీతాలు, హెల్త్ అలవెన్స్ బకాయిలు వెంటనే చెల్లించాలని డిమాండ్ నగర పంచాయతీ కార్యాలయం వద్ద కార్మికులు ధర్నా నిర్వహించారు. ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (సిఐటియు) ఆధ్వర్యంలో జరిగిన ధర్నా ఉద్దేశించి సిఐటియు జిల్లా అధ్యక్షులు దావాల రమణారావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ బడ్జెట్ నుండి కార్మికులకు నేరుగా చెల్లించే హెల్త్ అలవెన్సును చెల్లించకపోవడం విచారకరమన్నారు. స్పెషల్ డ్రైవ్ కింద గతంలో పనిచేసిన కార్మికుల వేతన బకాయిలు సుమారు రూ.60వేలు తక్షణమే చెల్లించాలని, కరోనా కాలంలో పనిచేసిన కార్మికుల్ని విధుల్లోకి తీసుకోవాలని, యూనిఫాం, కుట్టుకూలి తక్షణమే మంజూరు, తదితర సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

పాలకొండ నగరప ంచాయతీ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న కార్మికులు

యూనియన్ ప్రతినిధులు చింతల సంజీవి, పడాల వేణు, చింతల సురేష్, విమల, శ్రీదేవి, గ్రీన్ అంబాసిడర్ సంఘం ప్రతినిధులు ఎన్ గురువులు, సిహెచ్ శంకర్రావు, రవి, సిఐటియు మండల కార్యదర్శి కె.రాము తదితరులు పాల్గొన్నారు. అనంతరం నగర పంచాయతీ మేనేజర్‌కు వినతిని అందజేశారు.

సాలూరు : తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మున్సిపల్ కార్మికులు మంగళవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ నాయకులు టి.శంకర్, టి.రాముడు ఆధ్వర్యాన కార్మికులు ఆందోళన చేపట్టారు. పెండింగ్‌లో ఉన్న నెల జీతం, మూడు నెలల హెల్త్ అలవెన్సును వెంటనే మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. మరణించిన కార్మికుల కుటుంబాలకు చెందిన వారికి ఉద్యోగాలు ఇవ్వాలని కోరారు. కార్మికులపై పని ఒత్తిడి తగ్గించాలని కోరారు. సబ్బులు, నూనెలు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం మున్సిపల్ మేనేజర్ రాఘవాచార్యులకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్వైనాయుడు, ఫెడరేషన్ నాయకులు టి.ఇందు పాల్గొన్నారు.

జగన్ పాలనపై సంతృప్తి చెందా : రాజన్నదొర

మంత్రిగా బాధ్యత లు చేపట్టి ఏడాది పూర్తి

ప్రజాశక్తి - సాలూరు

సంక్షేమ సారధి జగన్ మోహన్ రెడ్డి నాయకత్వంలో పనిచేస్తున్నందుకు సంతృప్తిగా ఉందని డిప్యూటీ సిఎం, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి రాజన్నదొర అన్నారు. జగన్ ప్రభుత్వంలో మంత్రిగా బాధ్యతలు చేపట్టి ఏడాదైన సందర్భంగా మంగళవారం ఆయన నివాసం లో వైసిపి నాయకులు, కార్యకర్తలు ఆయనకు మిఠాయిలు తినిపించారు. మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ జర్జాపు దీప్తి రాజన్నదొరకు మిఠాయి తినిపించి శుభాకాంక్షలు తెలిపారు. వైసిపి పట్టణ మాజీ అధ్యక్షుడు జర్జాపు సూరిబాబు, జగనన్న పట్టణ సచివాలయాల కన్వీనర్ గిరిరఘు, కౌన్సిలర్ గొర్లి వెంకటరమణ, డిసిఎంఎస్ డైరెక్టర్ పిరిడి రామకష్ణ ఆయనకు శాలువా కప్పి సన్మానించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పేదలకు సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న సిఎం జగన్ మోహన్ రెడ్డి అని అన్నారు. నాలుగేళ్లలో కోటిన్నర మంది పేదలకు రూ.2.5లక్షల కోట్లు నగదు బదిలీ పథకం ద్వారా పంపిణీ చేశారన్నారు. పేదరికమే అర్హతగా తీసుకుని సంక్షేమ పథకాలకు లబ్దిదారుల ఎంపిక జరుగుతోందన్నారు. ఇలాంటి ప్రభుత్వం లో పని చేయడం చాలా సంతోషంగా వుందని చెప్పారు.

డిప్యూటీ సిఎం రాజన్నదొరకు స్వీట్ తినిపిస్తున్న మున్సిపల్ వైస్‌చైర్మన్ జర్జాపు దీప్తి

మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఆహారకమిషన్ సభ్యులు కాంతారావు

అనారోగ్యంతో ఎమ్మెల్యే సోదరుడు మృతి

ప్రజాశక్తి - వీరఘట్టం

స్థానిక ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి సోదరుడు విశ్వాస రాయి లక్ష్మణరావు (65) మంగళవారం రాత్రి అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందారు.. ఈయన గత కొద్ది రోజుల నుంచి అనారోగ్యానికి గురి కావడంతో పాలకొండ ప్రాంతీయ చికిత్స పొందుతూ తుది శ్వాస విడిచారు. లక్ష్మణరావు భార్య మనోరమ మాజీ ఎంపిటిసి సభ్యులు. ఆయన కుమారుడు భార్గవ్ ప్రస్తుతం మండల ఉపాధ్యక్షులుగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. లక్ష్మణరావు మరణ వార్త వినడంతో వండువ గ్రామం శోక సంద్రంలో మునిగిపోయింది.

సోదరుడి మృతదేహం వద్ద రోదిస్తున్న ఎమ్మెల్యే కళావతి

విద్యుత్ ఛార్జీలు తక్షణమే తగ్గించాలి

ప్రజాశక్తి - భామిని

విద్యుత్‌ఛార్జీలు తక్షణమే చెల్లించాలని స్థానిక విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద టిడిపి మండల అధ్యక్షులు బోగాపురపు రవినాయుడు, ప్రధాన కార్యదర్శి మెడిబోయిన జగదీశ్వరరావు ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. అనంతరం రవినాయుడు మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం అధికారానికి వచ్చిన నాలుగేళ్లలో ఏడుసార్లు విద్యుత్‌ఛార్జీలు పెంచిందని, రైతులకు స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేసిందని విమర్శించారు. తక్షణమే పెంచిన విద్యుత్‌ఛార్జీలు తగ్గించాలని డిమాండ్ చేశారు.అ నంతరం విద్యుత్‌శాఖ ఎఇ, డిప్యూటీ తహశీల్దార్‌కు వినతులను అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపిపి భూపతి ఆనందరావు, టిడిపి నాయకులు సాకేటి రామారావు, ఆగతముడి గోవిందరావు, బిడ్డికి ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

విద్య, ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ

రాష్ట్ర ఆహార కమిషన్ సభ్యులు కాంతారావు

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

ప్రభుత్వం నాణ్యమైన విద్య అందించడంతో పాటు విద్యార్థుల్లో ఆహార లోపం తలెత్తకుండా పోషక విలువలు పెంపొందించేందుకు ప్రత్యేక శ్రద్ధ వహిస్తుందని రాష్ట్ర ఆహార కమిషన్ సభ్యులు బి.కాంతారావు అన్నారు. పట్టణంలో పర్యటించి స్థానిక సంకావీధి అంగన్వాడీ కేంద్రం, జిల్లా పరిషత్ సంస్కృతోన్నత పాఠశాల, గ్రామ సచివాలయాన్ని మంగళవారం పరిశీలించారు. అంగన్వాడీ కేంద్రంలో జగనన్న గోరుముద్ద పథకం అమలు, సరుకుల నిల్వ, రికార్డుల నిర్వహణను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. వంటకాల రుచి చూసి నాణ్యతను పరిశీలించారు. రికార్డుల నిర్వహణ సక్రమంగా లేకపోవడాన్ని గమనించి సంబంధిత అంగన్వాడీ కార్యకర్తలకు మెమోలు జారీ చేయాలని ఐసిడిఎస్ పిఒ బి.శ్రీనివాసరావును ఆదేశించారు. ప్రభుత్వం నిర్దేశించిన మెనూను సక్రమంగా అమలు చేయాలన్నారు. కేంద్రంలోని చిన్నారులు చీకట్లో ఉండడాన్ని చూసి కారణాలను ప్రశ్నించారు. షార్ట్ సర్క్యూట్ కారణంగా విద్యుత్ లేదని తెలపగా ఇటువంటివి పునరావృతం కాకూడదని, విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎంత మంది గర్భిణీలకు పౌష్టికాహారం అందిస్తున్నది వివరాలు ఆరా తీశారు. రక్తహీనత లోపం తలెత్తకుండా బలవర్ధకమైన ఆహారాన్ని సక్రమంగా అందించాలని సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద వర్గాల పిల్లలు విద్యకు దూరం కాకూడదనే ఉద్దేశంతో అమ్మఒడి, జగనన్న గోరుముద్ద, జగనన్న విద్యా దీవెన వంటి పథకాలు ప్రభుత్వం ప్రవేశపెట్టిందన్నారు. పథకాల అమలు క్షేత్ర స్థాయిలో పక్కాగా అమలు జరిగేందుకు తనిఖీలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. లోపాలను సరిదిద్దుకుని ప్రభుత్వ ఆశయం నెరవేర్చేందుకు పథకాలను సమర్ధవంతంగా అమలు చేయాలని కోరారు. జిల్లా పరిషత్ సంస్కృతోన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనం పథకం అమలును, స్టాక్ రిజిస్టర్ లను పరిశీలించారు. అనంతరం గ్రామ సచివాలయాన్ని సందర్శించారు. అంతకుముందు జగన్నాథ పురం లోని ఎర్ర కంచమ్మ గ్రామ దేవత ను దర్శించుకున్నారు. కార్యక్రమంలో డిఎస్ఒ కెవిఎల్ఎన్‌మూర్తి, ఐసిడిఎస్ పీడీ కె.విజయగౌరి, డిటిడబ్ల్యుఒ పి.సూర్యనారాయణ, జిసిసి డిఎం వి.మహేంద్ర కుమార్, విద్యా శాఖ సహాయ సంచాలకులు రామజ్యోతి, సీతానగరం ఎంఇఒ జి.సూర్య దేముడు, ఆహార భద్రత అధికారి పి.వెంకటరమణ, కొమరాడ సిడిపిఒజి.సుగుణ కుమారి, జిల్లా పరిషత్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎ.శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

కొత్త పిఒకు సమస్యల స్వాగతం

- వేధిస్తున్న తాగునీరు, రోడ్లు, సిబ్బంది కొరత
- కొండంత ఆశలో గిరిజనం

ప్రజాశక్తి - సీతంపేట

స్థానిక ఐటిడిఎకు అనేక మంది ప్రాజెక్టు అధికారులు వస్తున్నారు... వెళ్తున్నారు.. అయినా గిరిజన సమస్యల పరిష్కారం మాత్రం ఎక్కడి వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారింది. గతంలో పనిచేసే పిఒ సమస్యల పరిష్కారానికి కొంతమేరకు చొరవ చూపినా నిధుల కొరత, రాజకీయ, ఇతర పరిస్థితులు అవరోధాలుగా మారుతున్నాయి. దీంతో అర్థాంతరంగా పనులు నిలిచిపోయిన సమస్యలు యథాతథంగానే ఉండిపోతున్నాయి. గిరిజనులకు ఎప్పటిలాగే కష్టాలు తప్పడంలేదు. ఈ నేపథ్యంలో ఐటిడిఎ కొత్త పిఒగా బుధవారం బాధ్యతలు చేపట్టనున్న కల్పనాకుమారి ఏ మేరకు సమస్యలు పరిష్కరిస్తారోనని గిరిజనులు ఎంతో ఆశగా ఎదురుచూస్తున్నారు.

వేధిస్తున్న సిబ్బంది కొరత

సీతంపేట ఐటిడిఎలో అధికారులు, సిబ్బంది కొరత వేధిస్తోంది. కీలకమైన ఐటిడిఎ పరిపాలన అధికారి, మేనేజర్, అకౌంట్స్ మేనేజర్, గణాంకా అధికారి, డిప్యూటీ డిఇఒ, పిహెచ్ఒ, డిడి, ఎపిడి వంటి కీలకమైన పోస్టులు ఖాళీగా ఉన్నాయి. అవి భర్తీ చేయాల్సి ఉంది. సీతంపేట ఐటిడిఎ పరిధిలో 47 ఆశ్రమ పాఠశాలలు, 16 పోస్ట్ మెట్రిక్ వసతి గృహాల్లో సుమారు 10,000మందికి పైగా విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. వీటిలో కమాటీ, కుక్, వాచ్‌మెన్, స్వీపర్ వంటి నాలుగో తరగతి సిబ్బంది 96 పోస్టులు ఖాళీగా ఉన్నాయి.

వెంటాడుతున్న తాగునీరు,రోడ్ల సమస్య

ఐటిడిఎ పరిధిలోని పలు గిరిజన గ్రామాల్లో తాగునీటి సమస్య వెంటాడుతుంది. వేసవి ప్రారంభం నుంచే తాగునీటి కోసం గిరిజనులు వెతుకులాట మొదలు పెడుతున్నారు. గిరిజన తండాల్లో రహదారులు లేక అనేక ఇబ్బందులు పడుతున్నారు. అత్యవసర సమయాల్లో డోలీలో శరణ్యమవుతున్నాయి. విద్యుత్తు, కనీస మౌలిక వసతులు లేని గ్రామాలు దర్శనమిస్తున్నాయి. జగనన్న గృహాలు పునాదులకే పరిమితమయ్యాయి. గిరిజనులు ఆరుగాలం సేకరించిన అటవీ ఉత్పత్తులకు మార్కెటింగ్ ధర కల్పించాల్సి అవసరం ఎంతైనా ఉంది. పర్యాటకంగా సంబంధించి సీతంపేట పిఎంఆర్‌సి వద్ద చేపడుతున్న గిరిజన మ్యూజియం, అడలి వ్యూపాయింట్ పనులు అర్థాంతరంగా నిలిచిపోయాయి. యువతకు శిక్షణలు లేక ఐటిడిఎ పరిధిలో గల నాలుగు వైటిసిలు వెలవెల బోతున్నాయి. అక్కడ పనిచేస్తున్న 20 మంది సిబ్బందికి 17 నెలలుగా జీతాలు చెల్లించలేదు. వీటితో పాటు మరిన్ని విద్య, వైద్యం సమస్యలను పరిష్కరించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఈ సమస్యలను కొత్త పీఒ పరిష్కరిస్తారన్న ఆశతో గిరిజనం ఉన్నారు.

ఐటిడిఎ పిఒగా కల్పనాకుమారి నేడు బాధ్యతల స్వీకరణ

స్థానిక ఐటిడిఎకు 48వ ఐటిడిఎ పిఒగా కల్పనాకుమారి బుధవారం బాధ్యతలు చేపట్టనున్నారు. ఈమె అనకాపల్లి జాయింట్ కలెక్టర్‌గా పనిచేస్తూ బదిలీవస్తున్నారు. అక్కడ సమర్థవంతంగా పనిచేశారని, భూ రీసర్వే వేగవంతంగా చేయించారని తెలిసింది. అలాగే సమస్యల పరిష్కారంలో, విధుల్లో నిర్లక్ష్యం వహించిన అధికారులపై కఠినంగా వ్యవహరించినట్టు తెలిసింది. స్థానిక ఐటిడిఎకు మహిళా పిఒగా నియామకంలో ఈమె రెండో అధికారులు. ఇక్కడి సమస్యలు పరిష్కరిస్తారని గిరిజనులు గంపెడాశతో ఎదురు చూస్తున్నారు. అలాగే గాడి తప్పిన శాఖలను ప్రక్షాళన దిశగా అడుగులు వేయాల్సి ఉంది.



ముత్యాలు జంక్షన్ వద్ద రహదారి దుస్థితి

నినాదాలు చేస్తున్న నాయకులు

ఘనంగా ఐకెఎస్ వ్యవస్థాపక దినోత్సవం

కొమరాడ : బిజెపి అమలు చేస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పికొట్టేందుకు ప్రజలంతా ఐక్యమత్యంతో పోరాడాలని రైతు సంఘం నాయకులు ఉపేంద్ర అన్నారు. మంగళవారం ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం నాయకత్వంలో ఆల్ ఇండియా కిసాన్ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా స్థానిక జికె కాలేజీ సెంటర్లో జెండా ఆవిష్కరణ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రైతులకు ఇబ్బందికరమైన మూడు నల్ల సాగు చట్టాన్ని రద్దు చేయాలని, పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని, విత్తనాలు, ఎరువుల ధరలు తగ్గించి సబ్సిడీ రూపంలో రైతులకు అందించాలని డిమాండ్ చేశారు. సిఐటియు నాయకులు కె.సాంబమూర్తి మాట్లాడుతూ ప్రజల సమస్యలపై కార్మికులు, రైతాంగం, వ్యవసాయ కూలీలు పెద్ద ఎత్తున పోరాడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రైతులు గౌరునాయుడు, సింహాచలం, చిన్నమనాయుడు, పోలినాయుడు, శివ, లక్ష్మి, వెంకటనాయుడు పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

కొమరాడ : వసతి గృహంలో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని తహశీల్దార్ సిహెచ్ రాధాకృష్ణ అన్నారు. మండలంలోని పెద్దఖేర్జెల గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాలను మంగళవారం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ముందుగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకటరావును పలు విషయాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పిల్లలకు పెడుతున్న భోజనాన్ని పరిశీలించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు మెనూ పక్కాగా అమలు చేయాలని ఆదేశించారు. విద్యార్థులు ఎటువంటి అనారోగ్యం బారినపడ్డా అలసత్వం చేయకుండా తక్షణమే ఆస్పత్రికి తరలించాలని సూచించారు. ఆయన వెంట విఆర్ఒ రాఘవ, రీ సర్వే డిటి ఉన్నారు.

రోగులతో మాట్లాడుతున్న డిఎంహెచ్ఒ జగన్నాథరావు

రోగులకు సేవలందించేందుకు కృషి చేయాలి

సీతానగరం : గ్రామీణ ప్రాంతాల్లో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని పక్కాగా నిర్వహించి పూర్తి స్థాయిలో ప్రజలకు వైద్య సేవలు అందించేందుకు వైద్య సిబ్బంది కృషి చేయాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ బగాది జగన్నాథరావు అన్నారు. మండలంలోని గుచ్చిమిలో నిర్వహించిన ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని మంగళవారం ఆయన ఆకస్మిక తనిఖీ చేసి, వైద్య సిబ్బందికి పలు సూచనలు చేశారు. గ్రామంలో ఈ కార్యక్రమానికి ముందురోజునే ప్రణాళిక వేసుకొని ప్రజలందరికీ తెలియజేయాలని, అలాగే గ్రామంలో దీర్ఘ కాలిక రోగులు, గర్భిణీలు, బాలింతలు, ఐదేళ్లలోపు పిల్లలు, ఆరోగ్యశ్రీ ద్వారా చికిత్స పొందిన రోగులు, కదల్లేని స్థితిలో ఉన్న రోగులు, సాధారణ అనారోగ్య లక్షణాలు గలవారు ఇలా ఎంతమంది ఉన్నారనే నివేదికలను సిద్ధం చేసుకొని తద్వారా పూర్తి స్థాయిలో వైద్య సేవలను అందించవచ్చని సూచించారు. అనంతరం ఆయన రోగులతో మాట్లాడి వారికి అందుతున్న వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. క్రమేణా ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం మరింత పకడ్బందీగా నిర్వహించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి ఉషారాణి, సిబ్బంది, 104 సిబ్బంది దుర్గాప్రసాద్, ప్రసాద్, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

సింహాచలం చిత్రపటానికి పూలమాల వేస్తున్న సిపిఎం నాయకులు

సింహాచలం ఆశయసాధనకు కృషి

భామిని : పేదలు, రైతుల హక్కులు కోసం తన జీవితాంతం పనిచేసిన ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం నాయకులు బర్రి సింహాచలమని, ఆయన ఆశయ సాధనకు కృషి చేయాలని సిపిఎం నాయకులు ఎం.తిరుపతి రావు, సిర్ల ప్రసాద్ అన్నారు. మండలంలోని బురుజోలలో బర్రి సింహాచలం 8వ వర్ధంతి సిపిఎం మండల కమిటీ నాయకులు జి.జగన్నాయకులు అధ్యక్షతన మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా సింహాచలం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ జిల్లాలో రైతుల సమస్యలు పరిష్కారానికి పెద్ద ఎత్తున పోరాటాలు సాగించారని, దళిత, గిరిజన, కార్మికుల పోరాటాలకు అండగా ఉండే వారని, ఆయన ఆశయసాధనకు, ప్రజాసమస్యలు పరిష్కారానికి ఐక్యపోరాటాలు తీవ్రతరం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు బర్రి పార్వతమ్మ, కె.మిన్నారావు, జి.ప్రసాద్, మంతిని అప్పలస్వామి తదితరులు పాల్గొన్నారు.

కోడూరుకు సన్మానం

సాలూరు : ఈనెల 9,10తేదీల్లో తిరుపతిలో జరిగిన ప్రపంచ తెలుగు సాహితీ బ్రహోత్సవాల్లో పాల్గొని సాహిత్య ప్రతిభ చాటుకున్న కోడూరు సాయి శ్రీనివాసరావును ఘనంగా సన్మానించారు. శ్రీశ్రీ కళావేదిక, జేచర్ల చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యాన నిర్వహించిన ప్రపంచ తెలుగు సాహితీ బ్రహ్మోత్సవాల్లో నేటి సమాజ మార్పులో కవి పాత్ర అనే అంశంపై ఆయన కవిత చదవడంతో ఆహూతులను అలరించింది. దీంతో ఆయన్ను మెమొంటో, ప్రశంసా పత్రం తో ఘనంగా సన్మానించారు.

మృతుల కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న జగదీశ్వరి

చిన్నారుల కుటుంబ సభ్యులకు పరామర్శ

కురు పాం: మండలం లోని నీలకంఠాపురం పంచా యతీ పెద్దగూడ గిరిజన గ్రామంలో ప్రమాద వశాత్తు నేల బావిలో పడి మృతి చెందిన సందీప్, సబిస్టి యన్ కుటుంబాలను టిడిపి నియోజకవర్గ ఇన్చార్జి టి.జగదీశ్వరి మంగళవారం పరామర్శించి ఓదార్చారు. మీ కుటుంబ సభ్యులకు ఎల్లప్పుడూ టిడిపి అండగా ఉంటుందని భరోసా ఇచ్చి, ఏ అవసరం వచ్చినా ఆదుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి కోలా రంజిత్ కుమార్, టిడిపి మాజీ మండల కన్వీనర్ చిలకలపల్లి వెంకటరావు, మండల పార్టీ ప్రధాన కార్యదర్శి బెజ్జిపురం శంకరరావు, టిడిపి నాయకులు బెహరా ప్రదీప్, ఆరిక సాయి పాల్గొన్నారు.

సారా ప్యాకెట్ల గొడవలో ఇద్దరికి గాయాలు

పార్వతీపురం రూరల్ : కొమరాడ మండలం గుమ్మడకు చెందిన బంగారి రాజేంద్ర, రాగోలు చంద్రశేఖర్ అదే గ్రామానికి చెందిన బొత్స మధుసూదనరావుతో ఘర్షణకు దిగారు. మంగళవారం కొమరాడ మండలం కల్లికోట జీడి తోటలో సారా ప్యాకెట్ల విషయమై జరిగిన గొడవల్లో పరస్పరం దాడులు చేసుకున్నారు. ఈ ఘటనలో గాయపడిన రాజేంద్ర, చంద్రశేఖర రావును వారి కుటుంబ సభ్యులు జిల్లా ఆసుపత్రికి తరలించగా, వైద్యులు చికిత్స అందిస్తున్నారు అవుట్ పోస్ట్ పోలీసులు వివరాలు నమోదు చేశారు.

నోటీసులివ్వకుండానే తొలగింపా?

- బాధితుల ఆవేదన
- కన్నెత్తి చూడని అధికారులు
- ఇదీ చినబోగిలి -మక్కువ రహదారి పనుల తీరు

ప్రజాశక్తి -మక్కువ

మక్కువ -చినబోగిలి మధ్య జరుగుతున్న ఆర్అండ్‌బి రహదారి పనుల వల్ల సర్వం కోల్పోయిన బాధితులను కనీసం పట్టించుకోకుండా, నిబంధనలు కూడా పాటించకుండా అధికారులు వ్యవహరిస్తున్న తీరు పలు విమర్శలకు దారితీస్తుంది. ఇటు ఆర్అండ్‌బి, ఇటు రెవెన్యూ అధికారులు రహదారి అభివృద్ధి పనుల కారణంగా సుమారు ఐదు గ్రామాల ప్రజలు ఇళ్లను కోల్పోయి ఇబ్బందులు గురవుతున్నా వారి గోడును ఎవరూ పట్టించుకోవడం లేదు. వివరాల్లోకి వెళ్తే...

రహదారి అభివృద్ధికి ఏ ఒక్కరూ ఆటంకం కలిగించనప్పటికీ అధికారులు మాత్రం వారు పాటించాల్సిన నిబంధనలు పాటించటం లేదని బాధితులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

మక్కువ-చినబోగిలి మధ్య రహదారి పనులకు సుమారు రూ.30 కోట్లు నిధులు మంజూరయ్యాయి. సుమారు 57 అడుగుల వరకు రహదారికి ఇరువైపులా కాలువలు నిర్మించనున్నారు. మండలంలోని వెంకటభైరిపురం, కొయ్యన్నపేట, పాపయ్యవలస, ములక్కాయ వలసతో పాటు సీతానగరం మండలంలోని బగ్గందొరవలస, తామరఖండి గుండా ఈ రహదారి నిర్మాణం జరుగుతుంది. ఈ రహదారి పనుల వల్ల వెంకట భైరిపురం, కొయ్యన్నపేట, పాపయ్యవలస, ములక్కాయవలసలో సుమారు 10 నుంచి 15 మంది వరకు తమ ఇళ్లను పూర్తిగా కోల్పోతున్నారు. ఆర్అండ్‌బి అధికారులు రహదారి నిర్మాణానికి సంబంధించి సూచికలు వేసి ఆయా ప్రజలకు వెంటనే ఈ ప్రాంతాన్ని ఖాళీ చేయాలని అనధికారంగా తెలియజేశారు. దీంతో కొంతమంది స్వచ్ఛందంగా నష్టపోయినా, గృహాలను యంత్రాలతో తొలగిస్తే ఇబ్బందులు పడతామమనే ఆలోచనతో అధికారులు సూచన మేరకు వారే సొంతంగా తొలగింపులు చేపట్టుకుంటున్నారు. వెంకటభైరిపురంలో గంటా తిరుపతిరావు, పిట్ట గంగులు, కొయ్యన్నపేటలో రవ్వ లక్ష్మి, శంకర్రావు, కొయ్యన కాశినాయుడు, పూల సింహాచలం, కునిశె లక్ష్మి, పెద్దమ్ములు, పాపయ్యవలసలో అల్లు అనసూయమ్మ తదితరులు ఇళ్లను పూర్తిగా కోల్పోతున్నారు. వీరందరికీ ఇప్పటివరకు అధికారులెవరూ కనీసం నోటీసులు కూడా ఇవ్వలేదని ఆవేదన చెందుతున్నారు. ప్రభుత్వం తగు నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని, లేకుంటే న్యాయపోరాటం చేస్తామని వారంతా చెబుతున్నారు.

కనీస నిబంధనలు పాటించడం లేదు

రోడ్డు అభివృద్ధి పనులకు ఏ ఒక్కరూ ఆటంకం కాదు. ఈ రహదారి పనుల్లో కొంతమంది నిర్వాసితులు అవుతున్నారు. కనీసం అధికారులు పట్టించుకోకపోవడం శోచనీయం. నిబంధనలు కూడా పాటించకుండా బాధితుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. సర్వం కోల్పోయిన వారికి నష్టపరిహారం చెల్లించాలి. లేకుంటే న్యాయపోరాటం తప్పదు.

కొయ్యాన కాశీ విశ్వనాథం,
మాజీ సర్పంచ్, కొయ్యన్నపేట.

రోడ్డు విస్తరణలో భాగంగా మార్కింగ్ చేస్తున్న అధికారులు

అధికారులతో కలిసి పరిశీలిస్తాం

మక్కువ-చినబోగిలి రహదారి పనులు ప్రారంభమయ్యాయి. ఈ రహదారిలో ఎవరెవరు నష్టపోతున్నారన్న అంశంపై అధికారులతో కలిసి పరిశీలన జరుపుతాం. ప్రభుత్వ నిబంధనలు అనుకూలంగా నిర్మాణ పనులు చేపడుతున్నాం. ఇప్పటివరకు ప్రైవేటు భూములున్నట్లు మా దృష్టికి రాలేదు. ఏమైనా ఉంటే రెవెన్యూ అధికారులకు సమాచారం అందిస్తాం. ప్రార్థనా మందిరాలు రెండు ఉన్నాయి. వాటిని పరిశీలిస్తాం

సుబ్బారావు,
ఆర్ అండ్‌బి, డిఇ.

సమాజ సేవకుడు జ్యోతీరావు పూలే

జ్యోతీరావు పూలేకు నివాళ్లు అర్పిస్తున్న డిప్యూటీ సిఎం రాజన్నదొర

ప్రజాశక్తి - సాలూరు

మహాత్మా జ్యోతిరావు పూలే సామాజిక సేవకుడని డిప్యూటీ సిఎం పి.రాజన్నదొర అన్నారు. మంగళవారం ఆయన నివాసంలో పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సమాజంలో అట్టడుగు వర్గాల కోసం పనిచేసిన గొప్ప దార్శనికుడు అని కొనియాడారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ జర్జాపు దీప్తి, పట్టణ వైసిపి మాజీ అధ్యక్షుడు జర్జాపు సూరిబాబు, మున్సిపల్ జగనన్న సచివాలయం కన్వీనర్ గిరిరఘు, కౌన్సిలర్ గొర్లి వెంకటరమణ డిసిఎంఎస్ డైరెక్టర్ పిరిడి రామకష్ణ వున్నారు.

కలెక్టరేట్ : జ్యోతిరావు పూలే గొప్పసంఘ సంస్కర్తని జిల్లా రెవెన్యూ అధికారి జె.వెంకటరావు అన్నారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్‌లో జ్యోతిరావు పూలే జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జ్యోతిరావుపూలే సమాజంలో పట్టిపీడిస్తున్న అంటరానితనాన్ని, అస్పృశ్యత, అసమానతలను తొలిగించేందుకు అనేక ఉద్యమాలు, పోరాటాలు చేసి సంఘ సంస్కరణలు తీసుకొచ్చారన్నారు. మహిళలపై వివక్షత పూర్తిగా తొలిగించి వారు కూడా చదువుకోవాలని భావించి ప్రత్యేక పాఠశాలలు నెలకొల్పి, పునాది వేసింది పూలే అని గుర్తుచేశారు. ఆయన చేసిన త్యాగాల ఫలితమే మనం అనుభవిస్తున్నామని, ముఖ్యంగా ప్రభుత్వ ఉద్యోగులంతా ఈ విషయాలన్నీ గుర్తుంచుకొని అంకితభావంతో పనిచేసి ఈ సంక్షేమ ఫలాలను సామాన్యులకు చేరువచేయాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన జ్యోతిరావు పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బిసి సంక్షేమ శాఖ అధికారి ఎస్.కృష్ణ, కలెక్టర్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వైసిపి కార్యాలయంలో...

పార్వతీపురం టౌన్ : మహత్మ జ్యోతిరావు పూలే జయంతి స్థానిక వైసిపి కార్యాలయంలో ఎమ్మెల్యే ఎ.జోగారావు ఆధ్వర్యాన జరిగింది. తొలుత పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ స్త్రీలకు ఆత్మస్థైర్యాన్ని కల్పించి వారి హక్కుల కోసం పోరాడి సాధికారత కల్పనకు కషి చేసిన మహనీయుడు పూలే అని కొనియాడారు. కార్యక్రమంలో పురపాలక సంఘం చైర్‌పర్సన్ బోను గౌరీశ్వరి, వైస్ చైర్మన్ ఇందుపూరు గున్నేశ్వరరావు, పార్టీ ఫ్లోర్ లీడర్ మంత్రి రవికుమార్, పట్టణ అధ్యక్షులు కొండపల్లి బాలకృష్ణ, జెసిఎస్ కన్వీనర్ గొర్లి మాధవరావు, బలిజిపేట మండల పార్టీ అధ్యక్షులు పాలవలస మురళీకృష్ణ, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

టిడిపి కార్యాలయంలో పూలే జయంతి వేడుకలు

పార్వతీపురం రూరల్ : స్థానిక టిడిపి కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే బొబ్బిలి చిరంజీవులు ఆధ్వర్యంలో పూలే జయంతోత్సవాలు ఘనంగా నిర్వహించారు. పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ కుల వివక్షత నిర్మూలనకు, బిసిల సంక్షేమానికి పూలే చేసిన కృషి మరువలేనిదన్నారు. కార్యక్రమంలో మండల పట్టణ పార్టీ అధ్యక్షులు జి.రవికుమార్, డి.మోహనరావు, ఎఎంసి మాజీ చైర్మన్ రెడ్డి శ్రీనివాసరావు, అరకు పార్లమెంటరీ నాయకులు జి.వెంకట నాయుడు, ఉదయభాను, బోను చంద్రమౌళి, కోల వెంకట్రావు, ప్రదీప్, రవికుమార్,, కౌన్సిలర్లు టి.వెంకట్రావు, కోల మధు, బడే గౌరునాయుడు తదితరులు పాల్గొన్నారు.

కురుపాం : స్థానిక టిడిపి కార్యాలయం వద్ద మహాత్మ జ్యోతిరావు పూలే జయంతి వేడుకను ఆ పార్టీ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా నియోజకవర్గ ఇన్చార్జి టి.జగదీశ్వరి హాజరై పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పూలే అణగారిన వర్గాలను అగ్రవర్గాల నుంచి కాపాడిన ఆశాజ్యోతి అని కొనియాడారు. కార్యక్రమంలో రాష్ట్ర తెలుగు యువత అధికార ప్రతినిధి కోలా రంజిత్ కుమార్, అరుకు పార్లమెంట్ బిసి సెల్ కార్యదర్శి కిమిడి రామరాజు, మాజీ సర్పంచ్ వెంపటాపు భారతి, టిడిపి నాయకులు కె.కళావతి, జానకమ్మ, బలగ రామకష్ణ, త్రినాథ, మహేష్, అజిత్, శ్రీనివాసరావు, రాజేష్, సంతోష్, సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

జ్యోతీరావు పూలేకు నివాళ్లు అర్పిస్తున్న డిఆర్ఒ, రెవెన్యూ అధికారులు

గుమ్మలక్ష్మీపురం : మండలంలోని మూలిగూడ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో హెచ్ఎం సామల సింహాచలం ఆధ్వర్యంలో జ్యోతిరావు పూలే చిత్రానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.కార్యక్రమంలో అసిస్టెంట్ టీచర్ ఎన్ సుధాకర్, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

పాచిపెంట : మండల కేంద్రంలో ఐద్వా ప్రతినిధి కె.సత్యవతి ఆధ్వర్యాన జ్యోతిబాపూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లు అర్పించారు. అనంతరం సిఐటియు నాయకులు కోరాడ ఈశ్వరరావు మాట్లాడారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు పి.రాంబాబు, మహిళా సంఘం నాయకులు కె.లక్ష్మి, కె.రవణమ్మ, పందిరి భారతమ్మ తదితరులు పాల్గొన్నారు.

వీరఘట్టం: మండలంలోని మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి వేడుకలు నడుకూరు, బొట్లపాడు లో జనసేన నాయకులు వజ్రగడ్డ రవికుమార్, ఎం.పుండరీకం పూలే చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు.

ఐటిడిఎతో అనుబంధం మరువలేను : పిఒ నవ్య

ప్రజాశక్తి - సీతంపేట

ఐటిడిఎతో అనుబంధం మరువలేనని పిఒ బి.నవ్య అన్నారు. ఉపాధి, శిక్షణా శాఖ డైరెక్టర్‌గా బదిలీపై వెళ్తున్న సందర్భంగా మంగళవారం ఆమెకు ఆత్మీయ వీడ్కోలు సత్కారాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పిఒ మాట్లాడుతూ ఐటిడిఎ పిఒగా పనిచేసిన సమయంలో ఇక్కడి అధికారులు, ప్రజాప్రతినిధులు ఎంతో సహకరించారన్నారు. పిఒగా తన వద్దకు వచ్చిన వినతుల్లో చాలా వరకు పరిష్కరించేందుకు కృషి చేశానన్నారు. గ్రామాలకు వెళ్లినప్పుడు గిరిజనులు చూపించే ప్రేమ, ఆదరణ మరువలేనని అన్నారు. ఎమ్మెల్యే కళావతి కృషి ఎనలేనిది. గిరిజన ప్రాంతాల అభివృద్ధికి సహకరించారని అన్నారు. విధి నిర్వహణలో తనకు సహకరించిన సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మెల్యే కళావతి మాట్లాడుతూ గిరిజన ప్రాంతాల అభివృద్ధికి పిఒ నవ్య ఎంతో కృషి చేశారన్నారు. నిబద్ధత, నిరాడంబరత ఆమె సొంతమని, విధి నిర్వహణలో ఎంతో నిజాయితీగా ఉండేవారని కొనియాడారు. అదే విధంగా ఉపాధి, శిక్షణ శాఖ డైరెక్టర్‌గా సీతంపేట గిరిజన ప్రాంతంలోని యువత అభివృద్ధికి కృషి ఆమె కోరారు. పాలకొండ సబ్ కలెక్టర్ నురూల్ కమర్ మాట్లాడుతూ పీవో బి.నవ్య చాలా నిరాడంబరంగా ఉంటారని అన్నారు. ఐటిడిఎలో ఉన్న అన్ని శాఖలను సులువుగా నిర్వహించేవారని అన్నారు. అంతకుముందు మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఎపిఒ రోసిరెడ్డి ఇఇ మురళి, ఇడి నగేష్, ఒఎస్‌డి (విద్య) యుగంధర్, పిఎఒ హరికృష్ణ, తహశీల్దార్ నర్సింహులు, ఎపిఒ కోటిబాబు, ఎంపిపి, జెడ్‌పిటిసి సభ్యులు, పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

పిఒ నవ్యను సత్కరిస్తున్న ఎమ్మెల్యే కళావతి, సబ్‌కలెక్టర్ నూరుల్‌కమర్

ఆహార చట్టంలో ప్రతీ అంశం అమలు చేయాలి

ప్రజాశక్తి - కలెక్టరేట్

ఆహార చట్టంలోని ప్రతి అంశం విధిగా అమలు చేయాలని రాష్ట్ర ఆహార కమిషన్ సభ్యులు బి.కాంతారావు అన్నారు. జిల్లా పర్యటనకు మంగళవారం విచ్చేసిన సభ్యులు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సంబంధిత శాఖల అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కాంతారావు మాట్లాడుతూ మధ్యాహ్న భోజనం, అంగన్వాడీలలో అందిస్తున్న పౌష్టికాహారం, వసతి గృహాల్లో ఆహార పదార్థాలు సక్రమంగా అమలు చేయాలని, తద్వారా రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావాలని పేర్కొన్నారు. అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని, బాధ్యత వహించాలని సూచించారు. మధ్యాహ్న భోజన పథకంలో రాగి జావను కూడా చేర్చి విద్యార్థులకు మరింత పౌష్టికాహారం అందాలని ప్రభుత్వం ఆలోచించిందని చెప్పారు. అంగన్వాడీ కేంద్రాల్లో లోపాలు సరిచేసి మంచి ఆహారం అందించేందుకు శ్రద్ధ వహించాలని ఆయన స్పష్టం చేశారు. ఎస్‌సి, ఎస్‌టి వసతి గృహాల్లో ఆహారం అందించడంలో ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. మెనూ విధిగా అమలు చేయాలన్నారు. పథకాల అమలు క్షేత్ర స్థాయిలో పక్కాగా అమలు జరగాలని ఆయన అన్నారు. కార్యక్రమంలో డిఎస్‌ఒ కెవిఎల్ఎన్.మూర్తి, ఐసిడిఎస్ పిడి కె.విజయగౌరి, డిటిడబ్ల్యుఒ బి.సూర్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

సబ్‌కలెక్టర్‌కు వినతిని అందజేస్తున్న గ్రీన్ అంబాసిడర్లు

బకాయి వేతనం చెల్లించాలి

ప్రజాశక్తి - పాలకొండ రూరల్

స్వచ్ఛభారత్ కార్మికులకు పెండింగ్ వేతనాలు ఇవ్వాలని కోరుతూ ఎపి గ్రామపంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ సిఐటియు పాలకొండ కమిటీ ఆధ్వర్యంలో ఏలామ్ జంక్షన్ నుంచి ఆర్‌డిఒ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి ధర్నా నిర్వహించారు. అనంతరం సబ్ కలెక్టర్ నూరుల్ కమర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షులు దావాల రమణారావు మాట్లాడుతూ గ్రీన్ అంబాసిడర్ కార్మికులకు ఒక్కొక్క పంచాయతీకి ఒక్కో రకంగా ఆరు నెలలు, 9 నెలలు, 12 నెలలు, 15 నెలలు వేతన బకాయిలు ఉన్నాయని, తక్షణమే చెల్లింపునకు తగు చర్యలు తీసుకోవాలని కోరారు. సబ్బులు, చెప్పులు, నూనె, చీపుర్లు ఇవ్వాలని, ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించాలని, జీవో 680 ప్రకారం రూ.10వేలు వేతనం, గుర్తింపు కార్డులు ఇవ్వాలని, రాష్ట్ర ప్రభుత్వమే గ్రీన్ అంబాసిడర్లకు వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఎపి గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ గ్రీన్ అంబాసిడర్ యూనియన్ ప్రతినిధులు కాద రాము, ఎన్. గురువులు, సిహెచ్. శంకర్రావు, రవి, కుర్మారావు తదితరులు పాల్గొన్నారు.

నవధాన్యాల సాగుతో నేల బాగు

పాచిపెంట : మండలంలో ప్రస్తుతం అడపాదడప కురుస్తున్న వర్షాలను రైతు వినియోగించుకోవాలంటే ఏకైక మార్గం నవధాన్యాల సాగు అని మండల వ్యవసాయ అధికారి కె.తిరుపతిరావు అన్నారు. మండలంలోని పి.కోనవలస ఆర్‌బికె వద్ద వద్ద ఏర్పాటు చేసిన నవధాన్య విత్తన ప్రదర్శనలో ఆయన మాట్లాడారు. మండలంలో మొక్కజొన్న, పత్తి అధికంగా సాగవుతుందని, వీటిని రైతులు జూన్ మొదటి వారంలో విత్తుకునే అలవాటు ఉన్నందున అత్యధిక దిగుబడులు పొందాలని సూచించారు. చీడ,పీడల ఉధృతి తక్కువగా ఉండి నాణ్యమైన దిగుబడి పొందాలన్నా భూసారం పెరగడానికి ప్రస్తుత వర్షాలకు నవధాన్యాలైన పచ్చిరొట్ట విత్తనాలను చల్లుకుని ప్రధాన పంట నాటే ముందుగా కలియ దున్నుకుంటే భూమిలో సేంద్రీయ పదార్థం పెరిగి భూమి సారవంతమై నాణ్యమైన అధిక దిగుబడులు పొందవచ్చని తెలిపారు. వీటితో పాటు అనేక ప్రయోజనాలున్న నవధాన్య విత్తనాలను సాగు చేయదలచుకున్న రైతులు సంబంధిత ఆర్‌బికెలను, ప్రకృతి సేద్య సిబ్బందిని సంప్రదించాలన్నారు. ఈ విత్తనాలు ఈనెల 15 నుంచి రైతులకు అందుబాటులో ఉంటాయన్నారు. కార్యక్రమంలో విఎఎ నాగమణి, ప్రకృతి సేద్య సిబ్బంది యశోదమ్మ, తిరుపతి నాయుడు, ఐసిఆర్‌పిలు సురేష్, విజయ్, రైతులు పాల్గొన్నారు.

13న టేకు, పనస చెట్లు వేలం

పార్వతీపురం టౌన్ : జగన్నాథపురం రిజర్వాయర్ వద్ద ఉన్న ఏడు టేకు చెట్లకు, ఒక పనస చెట్టుకు మునిసిపల్ కార్యాలయం ఆవరణలో ఈనెల 13న బహిరంగ వేలం వేయనున్న కమిషనర్ జె.రామ అప్పలనాయుడు ఒక ప్రకటనలో తెలియజేశారు. ఆసక్తి గల వారు తమ కార్యాయాల పనివేళల్లో సంప్రదించాలని సూచించారు.

వైసిపి పాలనకు చరమగీతం పాడాలి

ప్రజాశక్తి - సాలూరు

రానున్న ఎన్నికల్లో వైసిపి అరాచక పాలనకు ప్రజలు చరమగీతం పాడాలని టిడిపి నియోజకవర్గ ఇన్చార్జి జి.సంధ్యారాణి అన్నారు. మంగళవారం ఆమె పట్టణంలోని 22వార్డు తెలగావీధి, మేదరవీధి, చాకలి వీధుల్లో ఆమె పర్యటించి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నిత్యావసర వస్తువుల ధరలు, విద్యుత్ ఛార్జీలు విపరీతంగా పెరిగాయన్నారు.మున్సిపాలిటీలో అభివృద్ధి పనుల్లేవని చెప్పారు. పట్టణ ప్రజలపై పన్నుల భారం పెరిగిందని సంధ్యారాణి చెప్పారు. కార్యక్రమంలో అర్బన్ బ్యాంక్ మాజీ అధ్యక్షుడు కూనిశెట్టి భీమారావు, వార్డు నాయకులు పరమేశ్వరరావు, చిన్ని, పట్టణ అధ్యక్షుడు నిమ్మాది తిరుపతిరావు పాల్గొన్నారు.

పార్వతీపురంరూరల్: మండలంలోని సంగం వలస పంచాయతీ గదబవలస లో టిడిపి ఆధ్వర్యంలో ఇదేం కర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే బొబ్బిలి చిరంజీవులు ఆధ్వర్యంలో పార్టీ నాయకులు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను వివరించారు. అనంతరం గ్రామంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. సందర్భంగా చిరంజీవిలు మాట్లాడుతూ వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత అన్ని వర్గాల ప్రజలు చాలా ఇబ్బందులకు గురతున్నారన్నారు. వైసిపి పాలనతో విసిగిపోయిన ప్రజలు చంద్రబాబు పాలన కోసం ఎదురుచూస్తున్నారన్నారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు డి మోహనరావు, నాయకులు జి.వెంకటనాయుడు భాను, చంద్రమౌళి, జాగాన రవికుమార్, ధనుంజయ మాజీ సర్పంచ్ ఎ.రామకృష్ణ పాల్గొన్నారు.

పాఠశాలకు కంప్యూటర్, ఫర్నీచర్‌ను అందజేస్తున్న ఎస్‌జిఎక్స్ మినరల్స్ యాజమాన్యం

పాఠశాలకు రూ. 2లక్షలు ఫర్నీచర్ వితరణ

ప్రజాశక్తి - సాలూరు

కార్పొరేట్ సామాజిక బాధ్యత (సిఎస్ ఆర్) కింద తోణాం గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాలకు ఎస్ జిఎక్స్ మినరల్స్ కంపెనీ మంగళవారం రూ.2లక్షల విలువ చేసే ఫర్నీచర్, కంప్యూటర్, ప్రింటర్‌ను వితరణ చేసింది. పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో కంపెనీ యాజమాన్య ప్రతినిధి ఎకె సింగ్ పాఠశాల హెచ్ ఎం సింహాచలంకు వీటిని అందజేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో వైసిపి జిల్లా కార్యదర్శి దండి శ్రీనివాసరావు మాట్లాడుతూ 2014లో పూతికవలసలో కంపెనీ కార్యకలాపాలు ప్రారంభించిన నాటి నుంచి అనేక సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టిందని తెలిపారు. పూతికవలస, దిగువమెండంగికి తాగునీటి సరఫరా, రహదారి సౌకర్యాలకు సహకరించిందని చెప్పారు. గతంలో కంపెనీ యాజమాన్యం ఇచ్చిన హామీ మేరకు తోణాం పంచాయతీ పరిధిలో అభివృద్ధి పనులు చేపట్టాలని కోరారు. ఆలయం నిర్మాణానికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ మువ్వల ఆదియ్య, కంపెనీ మేనేజర్ సుధాకర్ పాల్గొన్నారు.

ఏజెన్సీలో 'గడప గడపకు మనప్రభుత్వం'

ప్రజాశక్తి - సీతంపేట

మండలంలోని దోనుబాయి సచివాలయం పరిధిలోని కె.వీరఘట్టం, దాసుగుమ్మడ, పెదతంకిడి, కుంభీ, నిమ్మలవలసలి, మేకవ, చెక్కాపురం గ్రామాల్లో గడప-గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పాలకొండ ఎమ్మెల్యే వి.కళావతి మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు కుల మత అతీతంగా అమలు చేస్తున్నామన్నారు. అవ్వా, తాతలకు ప్రతినెలా ఇంటి వద్దకే పెన్షన్ అందజేస్తున్నామని, అర్హులైన ప్రతి ఒక్కరికీ వాలంటీర్ గ్రామ సచివాలయం వ్యవస్థ ద్వారా మంచి పాలన అందిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఎంపిపి ఆదినారాయణ, ఎఎంసి చైర్మన్ మోహన్‌రావు, జిల్లా కోఆప్షన్ సభ్యులు లక్ష్మి, సర్పంచ్ కె.వెంకినాయుడు, ఎంపిటిసి సభ్యులు కోటేశ్వరరావు, వైసిపి మండల నాయకులు రాము, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

నాణ్యత లేకపోతే పంపించేయండి

వీరఘట్టం : జగనన్న విద్యా కానుక పంపిణీ సామాగ్రి నాణ్యత లేకపోతే తిరిగి పంపించేయండని జగనన్న విద్యా కానుక జిల్లా ప్రత్యేక అధికారి వై.నరసింహ సిబ్బందిని ఆదేశించారు. మంగళవారం స్థానిక జిల్లా పరిషత్తు బాలికల ఉన్నత పాఠశాలలో సిబ్బందికి ఏర్పాటుచేసిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. విద్యార్థులకు పాఠ్య పుస్తకాలతో పాటు బూట్లు, బ్యాగులు, తదితర వస్తువులను భద్రపరిచేందుకు ఏర్పాటుచేసిన స్టాక్ రూమ్ లో వచ్చినవి భద్రం చేయాలని ఆదేశించారు. అనంతరం సిబ్బంది మాట్లాడుతూ గతి ఏడాది పంపిణీ చేసిన బూట్లు సక్రమంగా లేవని, దీంతో విద్యార్థులకు బూట్లు పంపిణీ చేయలేదని తెలిపారు. ఇప్పుడు ఆ పరిస్థితి లేదని అందరికీ కొలతల ప్రకారమే బూట్లు, యూనిఫామ్‌లు పంపిణీ చేస్తున్నట్లు ఆయన స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఎంఇఒ పి.కృష్ణ మూర్తి, పాఠశాల హెచ్‌ఎం డి.నాగమణి, సిఎంఒ కె.రాజారావు, సిబ్బంది ఉన్నారు.

PARVATHIPURAM MUNICIPALITY
e.PROCUREMENT TENDER NOTICE

S.No.	NIT No.	No. of works	Total Estimate Amount
1	Tender No.1/2023-24 (APURMS Grant, SFC Grant And 15th FC Grant)	7 Works	Rs.30.00 Lakhs
Total		7 Works	Rs.30.00 Lakhs

For further details visit : For all details visit site
www.apeprocurement.gov.in

Sd/- J. Rama Appalanaidu
Commissioner
Parvathipuram Municipality